RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006 9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 49 పేజీలు - 04 వెల - 04/- శనివారం 23 నవంబర్ 2024

# భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవి

- వాటిని మరింతగా పటిష్టం చేసుకోవాలి
- లోక్‌మంథన్ కార్యక్రమంలో రాష్ట్రపతి పిలుపు
- రెండురోజుల పర్యటన ముగించుకుని ఢిల్లీకి ప్రయాణం




**హైదరాబాద్,ఆంధ్ర ప్రగతి నవంబర్ 22:** భారతీయ సంస్కృతి, ఆచారాలను నిరంతరం పటిష్టం చేయాల్సి ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో లోక్‌మంథన్ ప్రధాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. దేశ ప్రజల్లో సాంస్కృతిక, స్వాభిమాన్ భావన నెలకొల్పాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రాలను బలోపేతం చేసే దిశగా లోక్ మంథన్ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. '2018లో రాంచీలో లోక్‌మంథన్ కార్యక్రమంలో పాల్గొన్నా. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పటిష్టానికి ఈ ప్రయత్నం గొప్పది. ఇందులో పాల్గొంటున్న ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నా. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ సంస్కృతిలో భాగం. ఇది ఇంద్రధనస్సులోని సౌందర్యాన్ని సూచిస్తుంది' అని ద్రౌపదీ ముర్ము అన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేసే గొప్ప కార్యక్రమం అని లోక్ మంథన్ అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. భారతదేశ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, మన పరంపర చాలా ఘనమైనవి అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం గురించి మాట్లాడతాం.. పాటిస్తాం అన్నారు.

**మిగతాది 2లో...**

# ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను దెబ్బతీశారు

- వ్యవస్థలను నిర్వీర్యం ...అప్పుల కుప్పగా ఆర్థిక రంగం
- ఇప్పుడిప్పుడే గాడిలో పెట్టే ప్రయత్నాలు చేపట్టాం
- 'వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నినాదంతో ముందుకు
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు వెల్లడి



అమరావతి,ఆంధ్ర ప్రగతి నవంబర్ 22:

ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠ, బ్రాండ్‌ను దెబ్బతీసేలా వైకాపాపాలన సాగిందని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. అన్ని వ్యవస్థలను దెబ్బతీసారని, ఆర్థికంగా దోచుకున్నారని మండిపడ్డారు. మళ్లీ ఎపిని గాడిలో పెట్టేందుకు నానా అగచాట్లు పడుతున్నామని శాసనసభ సమావేశాల్లో ఆయన వెల్లడించారు. 'జగన్ చేసిన అవినీతి అంశాన్ని ప్రస్తావించడానికి కూడా ఇబ్బందికరమైన పరిస్థితి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ అంశాన్ని జాగ్రత్తగా గమనిస్తోంది. మరింత సమాచారం తీసుకుని తగిన విధంగా స్పందిస్తాం. మరొకరు ఇలాంటి తప్పులు చేయకుండా చూస్తాం. అమెరికా కోర్టులో వేసిన ఛార్జిషీట్ కూడా మా దగ్గర ఉంది. దీనిపై అధ్యయనం చేసి ఎలాంటి చర్యలు చేపట్టాలో నిర్ణయం తీసుకుంటాం' అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్స్ చేస్తూ కార్యక్రమాలు చేపడుతున్నామని సీఎం చంద్రబాబుఅన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని.. రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని చెప్పారు. భద్రత లేకుంటే రాష్ట్రంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రారన్నారు. శాసనసభ లో 'స్వర్ణాంధ్ర-2047' డాక్యుమెంట్‌పై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. 'వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నినాదంతో దీన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. 'వైకాపా ప్రభుత్వ అక్రమాలపై లోతుల్లోకి వెళ్లే కొద్దీ ఆశ్చర్యకర విషయాలు తెలుస్తున్నాయి

**మిగతాది 2లో...**


2లో

## ఏపీలో త్వరలో నూతన టెక్స్ టైల్ పాలసీ : మంత్రి సవిత

రాష్ట్ర వ్యాప్తంగా వీవర్ శాలలు ఏర్పాటు చేస్తామన్న మంత్రి సవిత

ఎమ్మిగనూరు, రాయదుర్గం, మైలవరం, పామిడిలో టెక్స్ టైల్స్ పార్కులు

చేనేత కార్మికులకు 90 శాతం సబ్సిడీతో పనిముట్లు అందజేస్తామన్న మంత్రి సవిత

# అదానీతో ఒప్పందం చేసుకోలేదు.

- వైసీపీ ప్రభుత్వంపై వస్తున్న వార్తల్లో నిజం లేదు: వైసీపీ
- అదానీపై అమెరికాలో కేసు
- గత ఏపీ ప్రభుత్వాధినేతకు రూ. 1,750 కోట్లు లంచంగా ఇచ్చారని ఆరోపణ
- తమ ప్రభుత్వం సెకీతో ఒప్పందం చేసుకుందన్న వైసీపీ

అమరావతి,ఆంధ్ర ప్రగతి నవంబర్ 22: భారత్ లో సోలార్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించి దాదాపు రూ. 2,100 కోట్లు




లంచంగా ఇచ్చారంటూ అదానీతో పాటు 8 మందిపై అమెరికాలో కేసు నమోదైన సంగతి తెలిసిందే. గత ఏపీ ప్రభుత్వాధినేతకు రూ. 1,750 కోట్లు లంచంగా ఇచ్చారని కేసులో పేర్కొన్నారు. దీనిపై వైసీపీ కేంద్ర కార్యాలయం అధికారికంగా స్పందించింది.

**మిగతాది 2లో...**

# జగన్ తన సైతాన్ సైన్యంతో దుష్ప్రచారం

- ప్రభాస్ ఎవరో తనకు తెలియదు
- పిల్లల మీద ఒట్టేసి చెబుతున్నా...అదంతా అబద్ధం
- ఆదానీతో చంద్రబాబు బంధం తెంచుకోవాల్సిందే
- మీడియా సమావేశంలో పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల



అమరావతి,ఆంధ్ర ప్రగతి నవంబర్ 22: ప్రభాస్ ఎవరో తనకు ఇప్పటికీ తెలియదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తన సైతాన్ సైన్యంతో ప్రభాస్‌తో తనకు సంబంధం ఉన్నట్లు ప్రచారం చేయించారని ఆరోపించారు. **మిగతాది 2లో...**


2లో

## పెద్దిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలకు అదనపు బాధ్యతలను అప్పగించిన జగన్

కర్నూలు, కడప జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ గా ఉన్న పెద్దిరెడ్డి చిత్తూరు జిల్లా కోఆర్డినేటర్ గా అదనపు బాధ్యతలు

వైవీ సుబ్బారెడ్డికి కృష్ణా జిల్లా కోఆర్డినేటర్ గా అదనపు బాధ్యతలు

# ఉపాధి అక్రమార్కులపై చర్యలు తథ్యం

## రూ. 13000 కోట్లు దారి మళ్లాయ్

- జాబ్ కార్డుల జారీపైనా లోతుగా విచారణ జరిపిస్తాం
- వ్యవసాయాన్ని ఉపాధితో అనుసంధానం చేస్తాం
- శ్మశానవాటిక పనులనూ అందులోనే చేపడుతాం
- కాలువల్లో తూడు కూడా ఉపాధిహామీలోనే చేయొచ్చు
- అసెంబ్లీలో స్పష్టం చేసిన ఉపముఖ్యమంత్రి పవన్



అమరావతి,ఆంధ్ర ప్రగతి నవంబర్ 22:

ఉపాధి హామీ పథకం పనులను గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిందని, ఆ నిధులను పెద్ద మొత్తంలో దారి మళ్లించారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. జాబ్ కార్డుల జారీలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. **మిగతాది 2లో...**




# ముగిసిన ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

**నవంబరు 11న ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు**

**మొత్తం 10 రోజుల పాటు సాగిన సభ కార్యకలాపాలు**

**21 బిల్లులు, 3 ప్రభుత్వ తీర్మానాలకు ఆమోదం**

అమరావతి,ఆంధ్ర ప్రగతి నవంబర్ 22:

ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నేటితో ముగిశాయి. విజన్ డాక్యుమెంట్-2047పై చర్చ అనంతరం అసెంబ్లీ నిరవధికంగా వాయిదా పడింది. నవంబరు 11న ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు 10 రోజుల పాటు జరిగాయి. మొత్తం 59 గంటల 55 నిమిషాల పాటు సభా కార్యకలాపాలు కొనసాగాయి. ఈ సమావేశాల్లో ఏపీ అసెంబ్లీలో మొత్తం 21 బిల్లులు ఆమోదం పొందాయి. 3 ప్రభుత్వ తీర్మానాలకు ఆమోదం లభించింది. అసెంబ్లీలో వివిధ చర్చల్లో 120 మంది సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# అదానీతో ఒప్పందం చేసుకోలేదు..

(మొదటి పేజీ తరువాయి)
విద్యుత్ కొనుగోలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీతో మాత్రమే వైసీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని... అదానీ గ్రూప్ తో ఏపీ డిస్కమ్ లు ఒప్పందాలు చేసుకోలేదని తెలిపింది. వైసీపీ ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేసింది. ఉచిత విద్యుత్ ను రైతులకు అందించాలనే లక్ష్యంతో 7 వేల మెగావాట్ల విద్యుత్ ను అత్యంత చౌకగా యూనిట్ కు రూ. 2.49 చొప్పున 2021 డిసెంబర్ 1న ఏపీ డిస్కమ్ లు ఒప్పందం చేసుకున్నాయని తెలిపింది. చంద్రబాబు అనాలోచిత విధానాలతో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాల వల్ల యూనిట్ ధర రూ. 5.10కి చేరిందని... ఇది డిస్కమ్ లపై తీవ్ర ప్రభావాన్ని చూపిందని చెప్పింది.

ఈ సమస్యను పరిష్కరించేందుకు సోలార్ పార్క్ లను అభివృద్ధి చేయాలని 2020లో ప్రభుత్వం ప్రతిపాదించిందని తెలిపింది. అంతర్రాష్ట్ర విద్యుత్ ఛార్జీలను మినహాయించి యూనిట్ రూ. 2.49 చొప్పున విద్యుత్ సరఫరా చేసేందుకు సెకీ ప్రతిపాదించిందని... అదే ధరతో 25 ఏళ్ల పాటు 7 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసేందుకు సెకీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని వెల్లడించింది. దీని వల్ల ప్రభుత్వానికి ప్రతి ఏటా రూ. 3,700 కోట్ల మేర ఆదా అవుతుందని... 25 ఏళ్ల పాటు ఒప్పందం అమల్లో ఉండటం వల్ల రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదా అవుతుందని తెలిపింది.

# ఏపీలో త్వరలో నూతన టెక్స్ టైల్ పాలసీ : మంత్రి సవిత

(మొదటి పేజీ తరువాయి)
త్వరలోనే నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకురానున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పార్కుపై టీడీపీ ఎమ్మెల్యే బి. జయనాగేశ్వరరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సవిత సమాధానం ఇచ్చారు. ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నిర్ణయించడం జరిగిందని, అందుకు 90 ఎకరాలను కేటాయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశారన్నారు.

తరవాత జగన్ సర్కార్ దాన్ని పట్టించుకోలేదన్నారు. అంతే కాకుండా పేదల ఇళ్ల పేరుతో ఎమ్మిగనూరు టెక్స్‌టైల్స్ పార్కులో 14 ఎకరాలను వైసీపీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. దీనిపై తాము న్యాయపోరాటం ద్వారా టెక్స్‌టైల్స్ పార్కు భూములను కాపాడుకోవడం జరిగిందన్నారు. ఎమ్మిగనూరులో కచ్చితంగా టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. దీని వల్ల 5 వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఎమ్మిగనూరుతో పాటు రాయదుర్గం, మైలవరం, పామిడిలోనూ టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి సవిత తెలిపారు. చీరాలలో హ్యాండ్లూమ్ పార్కుతో పాటు టెక్స్ టైల్స్ పార్కు కూడా నిర్మించనున్నట్లు తెలిపారు. త్వరలోనే టెక్స్ టైల్స్ పాలసీ తీసుకురాబోతున్నట్లు చెప్పారు. మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్ వీవర్ శాలలు ఏర్పాటు చేసి చేనేతలకు అండగా నిలిచారన్నారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా వీవర్ శాలలు ఏర్పాటు చేసే ఆలోచన తమ ప్రభుత్వానికి ఉందన్నారు. ఇప్పటికే కొందరు ఎంపీలు తమ ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి వీవర్ శాలలు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారని చెప్పారు. ఆదిత్య బిర్లా గ్రూప్ వంటి సంస్థల సాయంతో రాష్ట్రంలో పలుచోట వీవర్ శాలలు, క్లస్టర్లు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. చేనేత కార్మికులకు 90 శాతం సబ్సిడీతో పనిముట్లు అందజేయబోతున్నామని తెలిపారు. ధర్మవరంలో మెగా టెక్స్ టైల్స్ పార్కు ఏర్పాటుకు రూ.30 కోట్ల నిధులను కేంద్రం నుంచి రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంజూరుకు కృషి చేశారన్నారు. చేనేత రంగానికి, నేతన్నకు తమ ఎన్డీయే ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకురానుందని మంత్రి సవిత వెల్లడించారు.

# పీపీపీ మోడల్‌లో టూరిజం అభివృద్ధి

## పెట్టుబడిదారులకు రాయితీలు

అమరావతి,ఆంధ్ర ప్రగతి నవంబర్ 22:
ఏపీ ప్రభుత్వం టూరిజంపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. పర్యాటకులను ఆకర్షించేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా పీపీపీ విధానంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా ఏపీ టూరిజం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) మోడల్‌లో టూరిజం అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. టూరిజంలో ప్రైవేటు వ్యక్తులకు అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టనుంది. పెట్టుబడిదారులను ఆకర్షించేలా రాయితీలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం కొత్త టూరిజం పాలసీని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శాసన మండలిలో ప్రకటించారు. కొత్త టూరిజం పాలసీ ద్వారా పర్యాటక రంగంలో అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టనున్నామని వివరించారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి దుర్గేష్ వ్యాఖ్యానించారు. నూతన పర్యాటక పాలసీతో పర్యాటక రంగానికి నూతనోత్తేజం వచ్చిందన్నారు. రాబోయే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పర్యాటక రంగంలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. పీపీపీ విధానంలో రాష్ట్ర పర్యాటక రంగం అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు.

# పెద్దిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలకు అదనపు బాధ్యతలను అప్పగించిన జగన్

అమరావతి,ఆంధ్ర ప్రగతి నవంబర్ 22:పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలకు వైసీపీ అధినేత జగన్ అదనపు బాధ్యతలను అప్పగించారు. ఉమ్మడి కర్నూలు, ఉమ్మడి కడప జిల్లాలకు రీజనల్ కోఆర్డినేటర్ గా ఉన్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఉమ్మడి చిత్తూరు జిల్లా కోఆర్డినేటర్ గా బాధ్యతలను అప్పగించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు రీజనల్ కోఆర్డినేటర్ గా ఉన్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డికి ఉమ్మడి కృష్ణా జిల్లా వైసీపీ కోఆర్డినేటర్ గా బాధ్యతలను అప్పగించారు.


# జగన్ పై అనుచిత పోస్టులు... పోలీసులకు మాజీ మంత్రి కాకాణి ఫిర్యాదు

### వేదాయపాలెం పీఎస్ లో కాకాణి ఫిర్యాదు

### అనుచిత పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్న కాకాణి

### టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలు రెచ్చిపోతున్నారని మండిపాటు

అమరావతి,ఆంధ్ర ప్రగతి నవంబర్ 22:



వైసీపీ అధినేత జగన్ పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడుతున్నారంటూ వేదాయపాలెం పోలీసులకు వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఫిర్యాదు చేశారు. పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో కాకాణి మాట్లాడుతూ... జగన్ పై కొందరు టీడీపీ కార్యకర్తలు దారుణమైన పోస్టులు పెడుతున్నారని అన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఆయనపై అనుచిత పోస్టులు పెట్టారని తెలిపారు. వాళ్ల వివరాలను సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలు రెచ్చిపోతున్నారని కాకాణి మండిపడ్డారు. వైసీపీ కార్యకర్తలపై కేసులు పెడుతున్నట్టే... టీడీపీ వాళ్లపై కూడా కేసులు పెట్టాలని అన్నారు. రాజ్యాంగం అందరికీ ఒక్కటేనని చెప్పారు. సోమిరెడ్డి వల్ల ఇబ్బంది పడ్డ ఒక దళితుడి ఆవేదనను వాట్సాప్ లో షేర్ చేస్తే... తనపై కేసు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు వైసీపీ కార్యకర్తల పేర్లతో ఫేక్ ఐడీలు క్రియేట్ చేసి పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు.

# ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను దెబ్బతీశారు

(మొదటి పేజీ తరువాయి)
చరిత్రలో ఏ రాజకీయ నాయకుడూ ఇన్ని తప్పులు చేయరు. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. అధికార యంత్రాంగం మొత్తం నిర్వీర్యమైంది. అప్పులు పరాకాష్ఠకు చేరాయి. తప్పుడు ప్రచారాన్నే ఆధారంగా చేసుకుని పనిచేశారు. వాస్తవాలు చెప్పినా వాటిని పక్కన పెట్టి అసత్యాలను పదేపదే చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని చూశారు. ఇది చాలా దురదృష్టకరమైన రాజకీయం. బరితెగించి తప్పులు చేసి వాటిని ఒప్పులుగా చిత్రీకరించారు. ఇలాంటి విచిత్ర పరిస్థితిని నా 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎప్పుడూ చూడలేదు. ఎన్నికల్లో ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చారు. 93 శాతం స్ట్రయిక్ రేటుతో కూటమికి అధికారం కట్టబెట్టారు. 1995లో నేను తొలిసారి సీఎం అయినప్పుడు ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. ప్రజలకు చెప్తే సహకరించారు. అనివార్య పరిస్థితుల్లో అప్పట్లో రూ.2కి అందించే కిలో బియ్యం ధర పెంచాల్సి వచ్చింది. 1999లో విజన్-2020 తీసుకొచ్చాం. నాలెడ్జ్ ఎనానమీకి హైదరాబాద్ చిరునామాగా మారింది. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే భద్రత ఉండాలి. ప్రజలు కూడా దీన్ని అర్థం చేసుకోవాలి. వారికి చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ప్రజలను చైతన్యం చేయాలి. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అవుతుంది. ప్రధాని మోదీ వికసిత్ భారత్ పిలుపునిచ్చారు. మనం స్వర్ణాంధ్ర-2047 నినాదంతో ముందుకెళ్లాలి. ఎమ్మెల్యేలపై గురుతర బాధ్యత ఉంది. నియోజకవర్గ పరిధిలోనూ విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలి. 2047 నాటికి మీ నియోజకవర్గం ఎలా ఉండాలని కోరుకుంటున్నారో అందులో పొందుపర్చాలి. ప్రజలకు సేవ చేస్తే ఏ నియోజకవర్గమైనా గెలిపిస్తారు‘అని చంద్రబాబు అన్నారు. ఇదిలావుంటే తన అవినీతి ఖ్యాతిని జగన్ విశ్వవిఖ్యాతం చేసుకున్నారని తెదేపా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శించారు. శాసనసభ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రూ.60 వేల కోట్లు దోచుకొని జగన్ ఈడీ కేసుల్లో ఉన్నారన్నారు. 12 ఏళ్లుగా కేసును నడుపుకొంటూ వెళ్తున్నారని చెప్పారు. వాటిని ఎలా పొడిగించాలో తెలిసిన వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. అటువంటి వ్యక్తికి రూ.1,750 కోట్లు లంచం తీసుకోవడం ఓ లెక్కా అని ఎద్దేవా చేశారు. విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలతో భారీగా దోచుకునేందుకు ప్రణాళిక చేశారని ఆరోపించారు. ‘జగన్ దోపిడీతో రాష్ట్రానికి నష్టం జరిగింది. అదానీతో చాలా ఒప్పందాలు చేసుకున్నారు. ఓ తెలుగు వాడు నిర్వహిస్తున్న గంగవరం పోర్టును అక్రమంగా అదానీకి కట్టబెట్టారు. జగన్ అవినీతిని పరాకాష్ఠకు చేర్చారు. ప్రభుత్వ ఖర్చుతోనే తన నివాసానికి ఇనుప బారికేడ్లు పెట్టుకున్నారు. సీఎంగా పర్యటనకు వస్తే చెట్లు కొట్టేయాలా? పరదాలు పెట్టుకోవాలా? దుకాణాలు మూసేయాలా? ఇలాంటి పిరికి వ్యక్తి సీఎం ఎలా అయ్యారు? అమెరికాలో కేసులు వాయిదా వేయించుకునే అవకాశం లేదు. దేశంలో అయితే కేసులు వాయిదా వేయించుకోవచ్చు. జగన్ చేసిన నేరాలు, అక్రమాలపై విచారణ చేయాలని కోరుతున్నాం‘ అని బుచ్చయ్య చౌదరి అన్నారు.

# జగన్ తన సైతాన్ సైన్యంతో దుష్ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)
శుక్రవారం హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో జగన్ మోహన్ రెడ్డి , ఆదానీలపై వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. నేను ప్రభాస్ అనే వ్యక్తిని ఇంత వరకూ చూడలేదు. నా బిడ్డలపై ప్రమాణం చేసి చెబుతున్నా, ప్రభాస్ ఎవరో నాకు ఇప్పటికీ తెలియదు. ఆయనతో నాకు ఎలాంటి సంబంధం లేదు. జగన్‌కు ఇవ్వన్నీ తెలిసి కూడా, నాకు వ్యక్తిత్వం లేనట్లు ప్రచారం చేయించారు. ప్రభాస్‌తో సంబంధం ఉన్నట్లు గత ఐదేళ్లుగా జగన్ తన సైతాన్ సైన్యంతో సోషల్‌మీడియా వేదికగా విమర్శలు చేయించింది నిజం కాదా? మీకు చెల్లెలిపై ప్రేమ ఉందా? అసలు మీకు సిగ్గు ఉందా?మళ్లీ నా వీడియోనే ప్లే చేసి, మీకు మైలేజీ వచ్చేటట్లు వాడుకుంటున్నారు. మీకు పేరు వస్తుందంటే తల్లి, చెల్లి ఎవరి పేరైనా వాడేస్తారు. నాన్న పేరు సీబీఐ ఛార్జ్ షీట్‌లో పెట్టిస్తారు. మీకు మీరే సాటి‘ అంటూ తీవ్ర స్థాయిలో అన్న జగన్ మోహన్‌రెడ్డిపై మండిపడ్డారు.ఏపీ మాజీ సీఎం జగన్‌కు పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ రూ.1,750 కోట్ల లంచం ఇచ్చినట్లు అమెరికా ఏజెన్సీల దర్యాప్తులో వెల్లడైన నేపథ్యంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ తన స్వప్రయోజనాల కోసం చెల్లి, తల్లి పేర్లను వాడుకుంటున్నారని మండిపడ్డారు. బాలకృష్ణగారి నివాసంలో ఉన్న ఐపీ అడ్రస్ నుంచి నాపై తప్పుడు ప్రచారం జరిగిందని జగన్‌మోహన్‌రెడ్డి కేసు పెట్టినట్లు ఇటీవల ఎంటర్‌టైనింగ్‌గా చెప్పారు. మీకు నిజంగానే చెల్లెలిపై ప్రేమ ఉంటే, బాలకృష్ణగారి నివాసంలోని సిస్టమ్ ఐపీ అడ్రస్ నుంచి తప్పుడు ప్రచారం జరిగిందని నమ్మితే, ఐదేళ్లు సీఎంగా ఉండి మీరేం గాడిదలు కాశారు? బాలకృష్ణ మీద ఎందుకు విచారణ చేపట్టలేదు? మీరిప్పుడు చెల్లెలిపై ప్రేమ ఉన్నట్లు మాట్లాడుతున్నారు. ప్రభాస్‌కూ నాకూ సంబంధం ఉందని నాపై జరిగిన అసత్య ప్రచారంపై నేను కేసు పెట్టిన వెంటనే ఎందుకు స్పందించలేదని అన్నారు. నా మీద బాలకృష్ణ ఇంటి నుంచి తప్పుడు ప్రచారం జరిగిందని జగన్ ఒక్క ఎంటర్‌టైన్‌మెంట్ వీడియో చూయించారు. మీకు ఇలా జరిగిందని తెలిసి ఉంటే మీరు ఐదేళ్లు సీఎంగా ఉన్నారు. అప్పుడు గాడిదలు కాశారా. విచారణ ఎందుకు చేయలేదు. ప్రభాస్‌కు నాకు సంబంధం ఉందని వైసీపీ సోషల్ మీడియా ప్రచారం చేయలేదా. మా పిల్లల మీద ఒట్టేసి చెబుతున్న ప్రభాస్ ఎవరో నాకు తెలియదు. ఆయన్ని నేను ఎప్పుడూ చూడలేదు. జగన్ ఈ ప్రచారం చేయించారు. నా వీడియో చూయించి జగన్ సానుభూతి పొందాలని చూశారు. జగన్ ఆయన స్వార్థం కోసం అమ్మపై కేసు పెడతారు ...నాన్న పేరు సీబీఐ చార్జి షీట్‌లో పెడతారు.. తనపై దుష్ప్రచారం చేయిస్తారు‘ అని వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ బాటలో ఏపీ సీఎం చంద్రబాబు నడవొద్దు. ఇక మీదట ఏపీ నుంచి అదానీకి ప్రాజెక్ట్స్ ఇవ్వొద్దు. మోదీ అదానీ వేర్వేరు కాదు. మోదీ అదానికి రక్షణ కల్పిస్తున్నారు.అదానీ మోదీకి డబ్బులు ఇస్తున్నారు. సెబీ చీఫ్ కూడా అదానీ చేతిలో ఉంది. అదానీపై అమెరికాలో కేసు నమోదు చేసిన భారతదేశంలో ఆయనపై ఎటువంటి చర్యలు లేవు. దీన్ని చూస్తేనే అర్థం అవుతుంది మోదీ అదానీల బంధం అని విమర్శలు గుప్పించారు. పదేళ్లలో అదానీ అందనంత ఎత్తుకు ఎదిగాడు. ఇంత డబ్బులు సంపాదించడం ఎలా సాధ్యం. అదానీ వ్యవహారం మోదీకి , దేశానికి అవమానం. కాంగ్రెస్ అడిగే ఒక్క ప్రశ్నకు అయిన మోదీ సమాధానం చెప్పాలి. మోదీ అదానీనీ అమెరికాకు అప్పగిస్తారా. మోదీ అండతోనే దేశంలో ఇంత అవినీతి జరుగుతుంది. జస్టిస్ డిపా÷-టం÷-మెంట్ ఆఫ్ యూఎస్ఏ గౌతమ్ అదానీపై అభియోగాలు చేసింది. అదానీ టీం దేశంలో కొంతమంది సీఎంలకు లంచాలు ఇచ్చింది. ఇందులో ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి ఇచ్చింది. ఆగస్టు 2021లో జగన్‌కు ముడుపులు ముట్టాయి. పవర్ సప్లైలో అదానీ జగన్‌ను కలిసి మీకు ఏమి కావాలో ఇస్తామని ప్రామిస్ చేశారు‘ అని వైఎస్ షర్మిల గుర్తుచేశారు.‘అదానీతో జగన్‌కు కొన్ని కీలక విషయాల్లో డిస్కస్ జరిగింది. జగన్ మోదీకి దత్త పుత్రుడు. ఆయన మీద విచారణ చేయిస్తారా. అదానీపై జేపీసీ వేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదానీనీ బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి. ఒక సహచరిగా రేవంత్‌కు విజ్ఞప్తి చేస్తున్నాను.. అదానీతో బిజినెస్ చేయొద్దు. నేను జగన్మోహన్ రెడ్డినీ ఎత్తి చూపకపోతే నా ఆస్తి నాకు ఇస్తానని అంటున్నారు. కానీ నేను మాట్లాడకుండా ఉండలేను. నేను కాంగ్రెస్ పార్టీ చీఫ్ ... ఇలాంటివి నేను మాట్లాడకుంటే ఎలా‘ అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు.

# ఉపాధి అక్రమార్కులపై చర్యలు తథ్యం

(మొదటి పేజీ తరువాయి)
అసెంబ్లీలో స్పష్టం చేసిన ఉపముఖ్యమంత్రి పవన్
ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలు, నిర్లక్ష్య ధోరణిపై శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. పలు ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి పవన్ సమాధానం ఇచ్చారు. ఉపాధి పథకం అనేది డిమాండ్ ఆధారిత పథకమన్నారు. నైపుణ్యం లేని మ్యానువల్ పనిని చేయడానికి కూలీనాలీ జనానికి 100 రోజులు పని కల్పిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో ఈ పనులు చేపడుతున్నామని అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో కొత్తగా పని కోసం నమోదు చేసుకున్న వారికి జాబ్ కార్డులు ఇస్తున్నామని, 100 రోజులు పని కల్పించని స్థితిలో 15 రోజులు వేతనం పరిహారం చెల్లిస్తున్నామన్నారు. జాబ్ కార్డుల జారీలో జరిగిన అవకతవకలపై తప్పని సరిగా చర్యలు తీసుకుంటామన్నారు.అసెంబ్లీలో సభ్యులు చెప్పిన విషయాలను నోట్ చేసుకున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 4500 కోట్ల రూపాయలు వేజ్, మెటీరియల్ కాంపౌండ్‌తో నిధులు వచ్చాయన్నారు. జగన్ ప్రభుత్వం ?13వేల కోట్లు దారి మళ్లించిందని.. ఈ అంశంపై లోతైన విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ పనులను ఉపాధిహామీతో అనుసంధానం చేస్తామన్నారు. కాలువల్లో తూడు తొలగింపు పనులను డిస్ట్రిబూటర్ కమిటీలు చేపడుతాయని, కానీ తూడు తొలగింపు పనులు అత్యవసరమైతే స్థానిక ఎమ్మెల్యే కోరితే ఆ పనులు చేపట్టవచ్చన్నారు. ఇక శ్మాశాన వాటికల్లో పనులను ఉపాధిహామీతో అనుసంధానం చేస్తామన్నారు. పాఠశాలల కాంపౌండ్ వాల్ నిర్మాణాల తర్వాత శ్మశాన వాటికలకూ ప్రహరీ గోడలు నిర్మించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. ఉపాధి హామీ కూలీలకు మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నామని, తాగునీరు, వైద్యం తప్పనిసరిగా ఏర్పాటు చేస్తామన్నారు.గ్రామీణ ప్రాంతంలో పేదల ప్రజల అభివృద్ధికి ఉపయోగపడే పథకం ఇదని తెలుగుదేశం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. 70 నుంచి 80శాతం జాబ్ కార్డులున్నవారికి 100 రోజుల పనిని కల్పించాలని చెప్పారు. 10 శాతం దాటి అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 100 రోజులు పని లభించలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్ఆర్జీఈఏస్‌ను సర్వనాశనం చేశారని ఆరోపించారు. చివరకు దీనికి సంబంధించిన వెబ్‌సైట్లను కూడా మూసివేశారని మండిపడ్డారు. అరటి, కొబ్బరి, కొకొ, వక్కకు ఇస్తే పనిదినాలు పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు. గుర్రపుడెక్క తీసుకునే అవకాశం ఇస్తే పనిదినాలు పెరుగుతాయని ఆనందరావు చెప్పారు.గత ప్రభుత్వం రాజకీయ కక్షతో ఉపాధి హామీ పనులను దెబ్బతీసిందని చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ 22 శాఖలను ఉపాధి హామీ పనులతో అనుసంధానం చేస్తే.. పని పూర్తి చేసినోళ్లకు బిల్లులు చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ?351 కోట్లు చెల్లించారని, కానీ ఇప్పటికే 50 మంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. శ్మశాన వాటిక పనులను ఉపాధి హామీ పనులను కలపాలని కోరారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ, ఉపాధి హామీ జాబ్ కార్డుల జారీలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. కాలేజీకి వెళ్లి పిల్లలకు, జైళ్లల్లో ఖైదీలకూ జాబ్ కార్డులు ఇచ్చారని.. జాబ్ కార్డుల జారీలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

## అసెంబ్లీ లో ఆసక్తికర పరిణామం

ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలో ఈరోజు ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆలింగనం చేసుకున్నారు. అసెంబ్లీ వెలుపల కారు ఎక్కేందుకు పవన్ వస్తుండటాన్ని చూసిన వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు పక్కకు వెళ్లిపోయారు. అదే సమయంలో బొత్స... పవన్ కు నమస్కారం చేశారు. బొత్స స్పందనను చూసిన పవన్ ఆయనకు ఎదురెళ్లారు. బొత్స కూడా పవన్ వద్దకు వచ్చి ఆయనను ఆలింగనం చేసుకున్నారు. ఇద్దరూ మర్యాదపూర్వకంగా కరచాలనం చేసుకుని వెళ్లిపోయారు. **అమరావతి,ఆంధ్ర ప్రగతి నవంబర్ 22:**

## ఆలింగనం చేసుకున్న పవన్ కల్యాణ్, బొత్స




ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 23 నవంబర్ 2024

# ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు మొగ్గు చూపండి

**-జిల్లాలో 400 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగు. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 22:
రైతులు అధిక లాభాలను ఇచ్చే ఆయిల్ ఫామ్ సాగుపై మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం రుద్రవరం మండలం పెద్ద కంబలూరు గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా అధిక లాభాలనిచ్చే ఆయిల్ ఫామ్ సాగుపై మొగ్గుచూపి మంచి దిగుబడులు సాధించాలన్నారు. ప్రభుత్వం కూడా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున రాయితీలను ఇస్తోందన్నారు. జిల్లాలో ఆరు లక్షల ఎకరాల భూములలో రైతులు సాగు చేసుకుంటున్నారని ఇందులో దాదాపు 5 లక్షల ఎకరాలు వివిధ సాగునీటి ప్రాజెక్టులు, కాలువల కింద సాగునీరు అందుతుందన్నారు. ఉద్యాన పంటల కింద దాదాపు లక్ష ఎకరాలలో సాగవుతున్నాయని...ఇందులో 400 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగవుతోందని జిల్లాలో ఇంకా ఉద్యాన పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందని రైతులకు లాభదాయకంగా ఆయిల్ ఫామ్ సాగు పంటల వైపు రైతులు ముందుకు రావాలన్నారు. వంట నూనెలలో అనేక హెచ్చుతగ్గులు ఉండడం వల్ల విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుకు పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్ స్కీమును ప్రవేశ






పెట్టిందన్నారు. ఇందులో భాగంగానే నాలుగు కంపెనీలు ముందుకు వచ్చాయని మొదటి విడతగా 100 హెక్టార్లు 3 ఎఫ్ ఆయిల్ ఫామ్ ప్రైవేట్ లిమిటెడ్ కు ఇచ్చామని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ ఫామ్ మొక్కలను నాటిన తర్వాత నాలుగో సంవత్సరం నుండి దిగుబడులు ప్రారంభమవుతాయన్నారు.
కోస్తా తీరం వెంట రోడ్లకు ఇరువైపులా ఆయిల్ ఫామ్ సాగు తోటలు అధికంగా ఉన్నాయని... అధిక వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే ఈ ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఆయిల్ ఫామ్ సాగుకు తగినంత నీటి సౌకర్యం కల్పిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద ఆయిల్ ఫామ్ సాగును చేపడుతున్నట్లు ఇప్పటికే నంద్యాల, కొత్తపల్లి, మిడుతూరు, ప్యాపిలి, బండి ఆత్మకూరు మండలాలలో ఆయిల్ ఫామ్ సాగవుతుందన్నారు. వచ్చే ఏడాది 1000 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. రుద్రవరం మండలంలో ఎర్ర నేలలు ఆయిల్ ఫామ్ సాగుకు అనుకూలమని రైతులందరూ ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించి అధిక దిగుబడులు సాధించి ఆర్థిక ప్రయోజనం పొందాలని కలెక్టర్ ఆకాంక్షించారు.
ఆయిల్ ఫామ్ సాగు వల్ల కలిగే లాభాల గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తూ ఆసక్తి కలిగి ఉన్న రైతులకు ఆయిల్ ఫామ్ సాగు చేసేలా చూడాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, డ్వామా పిడి జనార్దన్ రావు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. అంతకుముందు మహానంది మండలం గాజులపల్లి గ్రామ రైతు వేసిన ఐదు ఎకరాల రోజా పూల తోటను పరిశీలించి చక్కగా ఉందని ప్రశంసిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# కొనసాగుతున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అమెరికా పర్యటన


ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 22:
నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అమెరికా దేశ పర్యటన కొనసాగుతోంది. అగ్రరాజ్యం అమెరికా దేశం న్యూయార్క్ నగరంలో ఈ నెల 18 వ తేదీ నుంచి 22 వ తేదీ వరకు 79 వ యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, ఈ ఐక్యరాజ్య సమితి



జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఇప్పటికే ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షులు హెచ్.ఇ . ఫిలెమోన్ యాంగ్ తో పాటు నమీబియా శాశ్వత ప్రతినిధి నెవిల్లే మెల్విన్ గెర్జ్, ఐక్యరాజ్య సమితి డిప్యూటీ సెక్రటరీ జనరల్ అమీనా మొహమ్మద్ లతో పాటు ప్రపంచ దేశాల ప్రతినిధులు, ఐక్యరాజ్య సమితి ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు. అలాగే యునైటెడ్ నేషన్ ఆఫ్ ఫైనాన్స్ చైర్మన్ అబ్దుల్లా బబార్ బాంగ్, ఉగ్రవాద నిరోధక యు ఎన్ అండర్ సెక్రటరీ జనరల్ వ్లదిమీర్ వొడోన్కోవ్, జర్మన్ రాయబారీ అంట్లజ్ లీండర్ స్ట్ లతో భారత ప్రతినిధిగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సమావేశం అయ్యారు.

# ఇండియన్ ఫుట్వేర్ షాపును ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్





ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 22: నంద్యాల సాయిబాబా టెంపుల్ దగ్గర మున్సిపల్ కాంప్లెక్స్ మూడో నెంబరు షాప్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఫుట్వేర్ షాప్ ఓపెనింగ్ శుక్రవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ చేతులు మీదుగా ఇండియన్ ఫుట్వేర్ షాప్ ఓపెనింగ్ చేయడం జరిగింది ఈ షాపులో సరసమైన ధరలకు మంచి క్వాలిటీ గల చెప్పులు లభించును .ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ఇంచార్జ్ మనీయర్ ఖలీల్ అహ్మద్ ఐయూఎంఎల్ నాయకులు సలాం మౌలానా మౌలానా ఇమ్రాన్ పలు పార్టీలకు సంబంధించిన నాయకులు జమాతే తబ్లీ ముఫ్తీ రఫీ మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనడం జరిగినది.

# అంగన్వాడీ కేంద్రాలలో నిర్మాణ పనులు పూర్తి చేయండి

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 22:
జిల్లాలో 439 అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్లు, త్రాగునీటి పైపు లైన్ నిర్మాణ పనులు చేపట్టి పెండింగ్లో ఉన్న 73 పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సిడిపిఓ లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్లు, మంచినీటి సౌకర్యంపై ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సిడిపిఓలతో సమీక్ష నిర్వహించారు. ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడి లీలావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 439 అంగన్వాడీ కేంద్రాలలో 231 టాయిలెట్లకు గాను 191 పూర్తయ్యాయని పెండింగ్ లో ఉన్న 40 టాయిలెట్ల నిర్మాణాలు, అలాగే 425 తాగునీటి పైప్ లైన్లకు గాను 390 త్రాగునీటి పైప్ లైన్ పనులు పూర్తి అయ్యాయని మిగిలిన 33 త్రాగునీటి పైప్ లైన్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సిడిపిఓ లను ఆదేశించారు. ఇంకా మొదలుపెట్టని పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పురోగతిలో ఉన్న నిర్మాణాలు వెంటనే పూర్తి దశకు




చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఫీజుబులిటీ మేర ఎంతవరకు చేయగలిగితే ఆమేర పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 101 సాక్ష్యం అంగన్వాడీల ఏర్పాటుకు ప్రభుత్వం ఎంపిక చేసిందని ఈ మేరకు పోషక విలువలు, ప్లేయింగ్ కిట్స్ సరఫరాకు టెండర్లు ఖరారు చేసి 11 పోషక విలువలు గల పదార్థాలు మరియు ప్లేయింగ్ కిట్స్ ను ఎంపిక చేసామన్నారు. సరఫరా చేసిన కిట్స్ ను నిరుపయోగంగా ఉంచకుండా పిల్లలకు ఉపయోగపడేలా అందుబాటులో వుంచి వినియోగించాలన్నారు. త్రాగునీటికి ఇబ్బంది లేకుండా పైపులైన్ల ఏర్పాటుకు ఏఈలతో సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సఖి వన్ స్టాప్ సెంటర్, బేటి పడావో బేటి పచావో, 100 శాతం పోషణ్ అభియాన్ కిట్లు, పిల్లల హాజరు నమోదు శాతం, గ్రోత్ మానిటరింగ్, ఎఫ్ఆర్ఎస్, బాలామృతం, పాలు, గుడ్లు, తదితర అన్ని పారామీటర్లలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడి కేంద్రాలు మంచిగా పని చేస్తున్నాయన్న ఫీడ్బ్యాక్ ప్రజల నుండి రావాలని ఇందుకు సంబంధించిన అధికారులందరూ చురుకుగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# యాదవ కార్తీక వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 22 నంద్యాల జిల్లా పద్మావతి నగర్ లో వెలసిన శ్రీ కృష్ణ భగవాన్ మందిరం నందు మొట్టమొ దటిసారిగా యాదవ కార్తీక వనభోజన కార్యక్రమాన్ని ఆదివారము ఏర్పాటు చేయడమైనది కావున నంద్యాల పట్టణ ముందు మరియు నంద్యాల పరిసరప్రాంతాలలోని యాదవ సోదరులు ,సోదరీమణులు కుటుంబ సమేతంగా విచ్చేసి జయప్రదం చేయాలని నంద్యాల యాదవ కార్తీక వనభోజన కమిటీ ద్వారా తెలియజేస్తున్నాము. ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పూజా కార్యక్రమాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు ఆటలు పోటీలు నిర్వహించడం జరుగుతుంది కావున యాదవ పెద్దలు ,పిల్లలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని నంద్యాల యాదవ కార్తీక కమిటీ బోదనం చంద్రశేఖర్ యాదవ్ పృథ్వీరాజ్ యాదవ్ విజయ గౌరీ యాదవ్ గొర్ల సత్యనారాయణ యాదవ్ పార్థసారధి యాదవ్ చంద్రుడు యాదవ్ తెలిపారు.

# నదుల అనుసంధానంపై రాయలసీమ ప్రజాసంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి

**-ముఖ్యమంత్రికి లేఖ వ్రాసిన బొజ్జా దశరథరామిరెడ్డి.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 22:
గోదావరి జలాలను కృష్ణా నదికి మళ్ళించి నదుల అనుసంధానం ద్వారా రాయలసీమలో ప్రతి ఎకరాకు నీరందించాలన్న ముఖ్యమంత్రి ప్రకటనను ఆహ్వానిస్తూ రాయలసీమ సాగునీటి రంగ అభివృద్ధిపై కొన్ని కీలక అంశాలను పొందుపరుస్తూ చంద్రబాబునాయుడు కు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి లేఖ వ్రాసారు.
ఈ సందర్భంగా శుక్రవారం నంద్యాల సమితి కార్యాలయంలో బొజ్జా మాట్లాడుతూ..గోదావరి నదీ జలాలను పోలవరం కుడి ప్రధాన కాలువ ద్వారా కృష్ణా నదికి, అక్కడి నుంచి వైకుంఠపురం బ్యారేజికి మళ్ళించడం ద్వారా రాయలసీమలో ప్రతి ఎకరాకు నీరందించాలన్న ముఖ్యమంత్రి సంకల్పాన్ని స్వాగతిస్తున్నామని బొజ్జా తెలిపారు.
815 టీఎంసీ లకు పైగా కృష్ణా జలాలు సముద్రంలో చేరుతున్నాయని ముఖ్యమంత్రి ఆవేదనతో చేసిన ప్రకటనను గుర్తుచేస్తూ, ఈ పరిస్థితికి కారణమైన రాయలసీమ సాగునీటి నిర్మాణాల దుస్తితిని ఆయన వివరించారు. అసంపూర్ణంగా ఉన్న రాయలసీమ సాగునీటి నిర్మాణాలను అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి పూర్తిచేసి రాయలసీమ హక్కుగా ఉన్న కృష్ణా జలాలను వినియోగించుకునే పరిస్థితిని కల్పించాలని కోరారు.
కృష్ణా జలాల నీటి లభ్యత వున్నప్పటికీ రాష్ట్ర విభజన చట్టంలో అనుమతించిన తెలుగుగంగ, గాలేరు -



నగరి, హంద్రీ - నీవా, వెలుగొండ ప్రాజెక్టుల మౌలిక నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటం వలన మరియు శ్రీశైలం రిజర్వాయర్ విధివిధానాలను సక్రమంగా అమలు పరచకపోవడం వల్ల ఆయకట్టుకు నీరందని పరిస్థితిపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు.
నాగార్జున సాగర్ దిగువ నుండి ప్రకాశం బ్యారేజి వరకు కృష్ణా డెల్టాకు చట్టబద్దంగా లభించే 101 టీఎంసీ ల నీటిని కృష్ణా డెల్టా వినియోగించుకోకపోవడం వలన ఒకవైపు ఈ జలాలు వృథాగా సముద్రం పాలవుతుంటే మరొకవైపు ఇదే కృష్ణా డెల్టా పరిరక్షణ కోసం శ్రీశైలం ప్రాజెక్టు నుండి నీటిని తరలించడం వలన శ్రీశైలం రిజర్వాయర్ పై ఒత్తిడి పెరగడంతో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల ఆయకట్టుకు సాగునీరు లభించడంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వీటిని అధిగమించాల్సిన అవసరం వుందని లేఖలో స్పష్టం చేశారు.
దుమ్ముగూడెం నాగార్జునసాగర్ టైల్పాండ్ ద్వారా గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు అందించేలాగా రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నప్పటికీ, దానికి బదులుగా పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదికి మళ్ళించే కార్యక్రమం చేపడుతున్న ప్రభుత్వం, గోదావరి జలాలను నాగార్జునసాగర్ లో నిలువ ఉంచి సాగర్ ఆయకట్టుకు నీరు అందించాలని తద్వారా శ్రీశైలం రిజర్వాయర్ ను పూర్తిగా వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వినియోగించేలాగా ప్రణాళిక చేపట్టాలని కోరారు.
రాయలసీమలో సాంప్రదాయక సాగునీటి వనరులైన చెరువుల పరిరక్షణ చేపడుతూనే పెన్నా, దాని ఉపనదుల పునరుజ్జీవం కోసం ప్రత్యేక రాయలసీమ పర్యావరణ పరిరక్షణ కమీషన్ ఏర్పాటు చేయాలి.
ప్రతి ఎకరాకు నీరు అందించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధించి, సంపద సృష్టించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టే దశలో రాయలసీమ రాయలసీమ ప్రజా సంఘాల సూచనలు, అభిప్రాయాలను వెల్లడించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుమతి ఇవ్వాలని బొజ్జా దశరథరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# బహుజనులకు స్ఫూర్తి ఝల్కరీబాయి

ఆంధ్ర ప్రగతి
కర్నూలు నవంబర్ 22:
బహుజనులకు స్ఫూర్తి వీరనారీ ఝల్కరీబాయి అని యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. కర్నూలులోని బి క్యాంపు నందలి మహిళా ఐక్య




వేదిక ప్రధాన కార్యాలయంలో ఝల్కరీబాయి 194 వ జయంతి కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ అధ్యక్షతన నిర్వహించారు. ఝల్కరీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్నం రాజేశ్వరితో పాటు మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఝాన్సీ రాజ్యానికి రాణి అయిన లక్ష్మీబాయికి మహిళా సైన్యాధిపతి అయిన ఝల్కరీబాయి ధైర్యసాహసాలు బహుజన మహిళలకు స్ఫూర్తినిస్తాయని వారు తెలిపారు. 1830 నవంబర్ 22 న ఝాన్సీ లోని భోజ్ లా గ్రామంలో కోరి కులంలో నిరుపేద కుటుంబంలో ఝల్కరీబాయి జన్మించారు. ఝల్కరీబాయి చిన్నతనంలోనే పులితో పోరాడి దానిని హతమార్చిన సాహసాన్ని గ్రామ ప్రజలు కొనియాడారు. ఝల్కరీబాయి ధైర్యసాహసాలు తెలుసుకున్న రాణీ లక్ష్మీబాయి సైన్యంలో చేర్చుకుని సైన్యాధిపతిగా నియమించారు. ఝాన్సీ రాజ్యం పై బ్రిటీష్ సైన్యం యుద్ధానికి రాగా రాణి లక్ష్మీబాయి స్థానంలో ఝల్కరీబాయి యుద్ధం చేశారు. ఝల్కరీబాయి తన బిడ్డను వీపున కట్టుకుని బ్రిటీష్ సైన్యం పై వీరోచితంగా పోరాడారు. ఝల్కరీబాయి ధైర్య సాహసాలకు తెలివికి తెగువకు బ్రిటీష్ అధికారులు ఆశ్చర్య పోయారు. ఝల్కరీబాయి ని పట్టుకుని నిర్బంధించి లక్ష్మీబాయి ఆచూకీ చెప్పమని బ్రిటీష్ సైన్యం చిత్రహింసలు పెట్టారు. ఆ తర్వాత ఝల్కరీబాయి ని చంపేశారు. చరిత్ర మరుగున ఝల్కరీబాయి ని తొక్కిపెట్టిన ఆధిపత్య కులాల కుట్రలు ఎంతోకాలం సాగవని బహుజనులు మేల్కొన్నారని వారు తెలిపారు.

# శ్రీ మహానందీశ్వర, శ్రీ కామేశ్వరి అమ్మవారు లను దర్శించుకున్న ఎంపీపీ

ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 22:



శుక్రవారం శ్రీ మహానందీశ్వర, శ్రీ కామేశ్వరి అమ్మవారు లను దర్శించుకున్న మహానందిన మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు(ఎంపీపీ) బుడ్డారెడ్డి యశస్విని గారు, సోదరి బుడ్డారెడ్డి కౌశస్విని ముందుగా వీరికి ఆలయ మర్యాదలతో దేవస్థానం అధికారులు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వాదచనాలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీఈశ్వర స్వామి దేవస్థానం ప్రవచనాలు.

ఆంధ్ర ప్రగతి ప్యాపిలి నవంబర్ 22:




ఈనెల 26వ తేదీ నుండి నాలుగు రోజుల పాటు మండల కేంద్రమైన ప్యాపిలి లోని శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ ఈశ్వర స్వామి దేవస్థానం నందు ప్రతిరోజు సాయంత్రం 6గంటల నుండి 8 గంటల వరకు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై డాక్టర్ తొగట సురేశ్ బాబుచే ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు డాక్టర్ దేవి దయానంద సింగ్, శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ ఈశ్వర స్వామి దేవస్థానం నిర్వాహకులు కంచి నరేశ్ కుమార్, అంకాల పరమేశ్వరి దేవస్థానం నిర్వాహకులు గోపాల్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబందించిన కరపత్రాలను స్థానిక భజన మండలి సభ్యులచే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ రంగయ్య, ముద్దనూరు రామాంజనేయులు, కె. లక్ష్మీ సులోచన, కె.రాంప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 26 దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ఆంధ్ర ప్రగతి కోవెలకుంట్ల నవంబర్ 22:



కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ 13 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా జిల్లా కేంద్రాలలో నవంబరు 26 దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా నంద్యాలలో జరిగే ర్యాలీ నిరసన ధర్నాకు పెద్ద సంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ఏ ఐ టి యు సి కార్మిక సంఘాల, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కోయిలకుంట్ల జూనియర్ కాలేజ్ ఆవరణలో కరపత్రాలను విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ శివ బాలకృష్ణ , మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ముందు దేశవ్యాప్తంగా కార్మికులు రైతులు పదేళ్ల క్రితం పెట్టిన 15 డిమాండ్లలో ఏ ఒక్క కోర్కెను మోడీ ప్రభుత్వ నెరవేర్చలేదని విమర్శించారు. మధ్య తరగతి ప్రజలు పన్నులు చెల్లించలేక పేదరికంలోకి జారుకుంటున్నట్లు నివేదికలు తెలియజేస్తున్నాయని, రైతులు కార్మికులు మరింత పేదరికంలోకి నెట్టబడడానికి మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే కారణమని తెలియజేశారు. ఇదే సందర్భంలో కార్పొరేట్లకు 12 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి ప్రపంచ కుబేరుల స్థానంలో అదానీ, అంబానీలు ఎదగడానికి మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా సహాయపడుతుందన్నారు.రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, పరిశ్రమలలో కార్మికుల జీవితాలకు భద్రత కల్పించేలా సేఫ్టీ సౌకర్యాలు కల్పించాలని, నిత్యవసర సరుకుల ధరలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధిని కేటాయించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మికులను బానిసత్వం నుండి విడుదల చేయాలని, కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు, నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలను కల్పించి రోజు వేతనం 600 చెల్లించాలని, విశాఖ ఉక్కు, రైల్వే, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఖాళీగా ఉన్న 18 లక్షల పోస్టులు నిరుద్యోగులతో తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 26 నంద్యాలలో జరిగే కార్మిక కర్షక ఐక్య ధర్నాలో పెద్దసంఖ్యలో నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

## శారీరక దృఢత్వం మానసిక వికాసం కొరకు

# వీక్లీ పోలీస్ పెరేడ్ డ్రిల్ల్ నిర్వహణ





ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 22:

నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయం ఎదురుగా గల మైదానం నందు నంద్యాల సబ్ డివిజన్ పోలీస్ అధికారులు మరియు వారి సిబ్బందితో వీక్లీ పోలీస్ పెరేడ్ డ్రిల్ల్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఈ వీక్లీ పోలీస్ పెరేడ్ డ్రిల్ల్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తప్పనిసరిగా సాయుధ బలగాల సిబ్బంది సివిల్ పోలీసులు అందరూ హాజరుకావాలని తెలియజేశారు.పెరేడ్ డ్రిల్ చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కలుగుతుంది.ప్రతి శుక్రవారం పోలీస్ డ్రిల్ మాత్రమే కాకుండా యోగ ఫిజికల్ ట్రైనింగ్ మొదలగునవి నిర్వహించడం జరుగుతుంది.వివిధ రకాల పోలీస్ డ్యూటీలలో ఉన్న అందరూ ఒకే చోట కలవడం ద్వారా సమస్యలు అధికారులకు తెలియజేయడం మరియు ఈ పెరేడ్ డ్రిల్ కార్యక్రమం ఒక రీఫ్రెష్ కోర్సులా సిబ్బందికి ఉపయోగపడుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు నంద్యాల సబ్ డివిజన్ డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డి, ఏ ఆర్ డి.ఎస్.పి శ్రీనివాసులు, సాయుధ బలగాల సిబ్బంది, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

# నేరాల కట్టడికి,నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

**-లాడ్జీల యాజమాన్యాల నంద్యాల టౌన్ డిఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి తో సమీక్షా సమావేశం నిర్వహణ.**





ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 22':

నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల టౌన్ డిఎస్పీ పి. శ్రీనివాసరెడ్డి గారు, టౌన్ ఇన్స్పెక్టర్ ల ఆద్వర్యంలో నేడు రామక్రిష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియం నందు నంద్యాల పట్టణంలోని లాడ్జి యాజమాన్యాలతో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సంధర్బంగా టౌన్ డిఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో బాగంగా లాడ్జిలపై నిఘా ఉంచాలని మరియు పట్టణ పోలీసుల పనితీరు అడిగి తెలుసుకున్నారు.

ముఖ్యంగా లాడ్జిల యందు తప్పనిసరిగా సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎక్కువ రోజులు ఎవరు ఉంటున్నారు అటువంటి వారిపై నిఘా ఉంచి వారి వివరాలు పోలీసులకు అందించాలి.లాడ్జికి వచ్చిన వారి నుండి ఆదార్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలి.మరియు వారి చిరునామాతోకూడిన పూర్తి వివరాలు తీసుకోవాలి.పట్టణంలో భవన నిర్మాణాల కొరకు చాలా మంది వివిద రాష్ట్రాల నుండి అనగా బిహార్,పచ్చిమ బెంగాల్,ఒరిస్సా,ఉత్తర ప్రదేశ్ మొదలగు ప్రాంతాల నుండి పని చేసుకొనుటకు కొత్త వారు రావడం జరుగుతుంది. అటువంటి వారిపై నిఘా ఉంచాలి.

లాడ్జిలలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా లాడ్జి యజమానులు తగిన చర్యలు తీసుకోవాలి.ఏదైనా అనుమానం ఉంటే తప్పనిసరిగా సంబందిత పోలీసు అదికారులకు సమాచారం అందించాలి.లాడ్జి యజమానులు తప్పనిసరిగా ప్రతి 24 గంటకు ఒకసారి ఎంతమంది కొత్త వ్యక్తులు వచ్చారు అనే విషయం సంబందిత పోలీసు అధికారులకు సమాచారం అందించాలి. రోజూ రోజూకూ నేరాలు పెరిగి పోతున్నాయని ప్రతి ఒక్కరూ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్రమత్తంగా ఉండాలన్నారు మరియు ముఖ్యమైన అన్ని వ్యాపార సముదాయాల యందు షాపింగ్ మాల్స్, జ్యూవెలరీ, లాడ్జీల యందు మన్నిక కలిగిన సీసీ కెమెరాలు స్వచ్ఛంధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాల కట్టడికి , నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డిఎస్పీ తో పాటు ఇన్స్పెక్టర్లు ఇస్మాయిల్ మల్లికార్జున గుప్తా సుధాకర్ రెడ్డి,సూర్య మౌళి పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ రైతులకు ఇచ్చినహామీలను వెంటనే అమలు చేయాలి

## -ఏపీ రైతు సంఘం.సిఐటియు డిమాండ్.

ఆంధ్ర ప్రగతి పాణ్యం నవంబర్ 22:



రైతులు పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలకైపార్లమెంట్లో చట్టం చేయాలని, రైతులపై ఉన్న అన్ని రకాల అప్పులను రద్దు చేయాలని, చిన్న, సన్నకారు రైతులకు నెలకు పదివేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని పాణ్యం మండలంలో సోలార్ ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోతున్న రైతులకు ,వ్యవసాయ కూలీలకు 2013 చట్టాన్ని అమలు చేసి నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ .రాజశేఖర్, జిల్లా నాయకులు ఏ.సురేష్, ఓ ప్రసాద్ పాణ్యం పామండలం తమ్మరాజు పల్లేగ్రామంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా సెంటర్లో కార్మిక రైతు సంఘాల నాయకత్వన జరుగునిరసన ప్రదర్శన లో కార్మికులు ,రైతులు ,కూలీలు ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ ప్రదర్శన 26వ తేదీ ఉదయం 10 గంటలకు నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ప్రారంభం అవుతుందని అన్నారు. రైతులు ఆరు కాలం కష్టపడి అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి వాతావరణ పరిస్థితులను తట్టుకొని ,మరొకవైపు నకిలీ విత్తనాల వల్ల నష్టపోతు పంటలు పండిస్తున్నారు .ఆ పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక పెట్టిన పెట్టుబడులు చేతుగాక రైతులు ఆత్మహత్యలు పాలవుతున్నారని ఈ ఖరీఫ్లో చేతికి వచ్చిన మొక్కజొన్న వరి ధాన్యాన్ని మార్కెట్లో ప్రైవేటు వ్యాపారస్తులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు కాకుండా మొక్కజొన్న కింటాలు 22 00రూపాయలకు వరి ధాన్యం బస్తా 1200 రూపాయలు నుంచి 1300 రూపాయలకే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఇంత నష్టాల పాలవుతున్న ప్రజాప్రతినిధులు ,ప్రభుత్వ అధికారులు తమకు సంబంధించినది కాదు అనే పద్ధతిలో ఉన్నారని పంటలను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను నష్టపుచ్చుతున్న నివారణ చర్యలు చేపట్టలేదు అన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన మొక్కజొన్న 2225 రూపాయలు ,75 కేజీల వరి ధాన్యాన్ని 1750 కొనుగోలు చేసే లాగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఈమధ్య పాణ్యం మండలం పిన్నాపురం లో చేపడుతున్న సోలార్ ప్రాజెక్టును సందర్శించిందని కానీ ఆ ప్రాజెక్టు వల్ల నష్టాల పాలవుతున్న తాతలనాటి కాలం నుంచి అనుభవంలో ఉన్న భూములను కొల్లగొడుతున్న పిన్నాపురం గ్రామాన్ని సందర్శించి ఆ గ్రామ ప్రజలకు న్యాయం జరిగేలా వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గోరుకంటి ఎర్రమల గ్రామ రైతులు హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

# రోబోటిక్ శస్త్ర చికిత్సలతో మెరుగైన ఫలితాలు

**-ప్రముఖ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్.**

**-వ్యాయామం, మితాహారం,మంచి అలవాట్లు గుండెపోటును దూరంగా ఉంచుతాయి.**

**-ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గురు ప్రకాష్.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 22:




భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్ సహకారంతో మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో నంద్యాల ప్రాంత వైద్యులకు వైద్య సదస్సు నిర్వహించారు.నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్ నిర్వహణలో జరిగిన ఈ సదస్సులో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభించారు. సదస్సులో యశోద హాస్పిటల్ సీనియర్ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ "రోబోటిక్ శస్త్ర చికిత్స-ప్రయోజనాలు"అన్న అంశంపై ప్రసంగిస్తూ రోబోటిక్ శస్త్ర చికిత్స వలన మరింత మెరుగైన నిర్దిష్ట ఫలితాలు సాధించడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గుతుందన్నారు. శస్త్ర చికిత్స నిపుణులు రోబోటిక్ యంత్రాన్ని సమన్వయం చేస్తారన్నారు.

గుండె పోటు నివారణ అన్న అంశంపై యశోద ఆసుపత్రి ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ గురు ప్రకాష్ మాట్లాడుతూ తగిన వ్యాయామం క్రమం తప్పకుండా చేయడం, సరైన మితాహారం, దురలవాట్లకు దూరంగా ఉండడం ద్వారా గుండెపోటు రాకుండా చూసుకోవచ్చు అన్నారు. చాతిలో నొప్పి, నొప్పి మెడ, చేతులకు పాకినట్లు ఉండడం,ఒళ్లంతా చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యున్ని సంప్రదించి ఈసీజీ పరీక్ష, గుండెపోటు సంబంధించి రక్త పరీక్షలు చేయించుకోవడం అవసరమన్నారు. గుండెపోటు వచ్చినప్పుడు తగిన సమయంలో సత్వర చికిత్స అందిస్తే ప్రాణాపాయం తప్పించవచ్చున్నారు. గుండెపోటు నుండి కోలుకున్న తర్వాత యాంజియోగ్రామ్ పరీక్ష ద్వారా గుండె నాళాలలో ఉన్న సమస్యలు గుర్తించి దానికి సంబంధించిన చికిత్సలు చేయించుకోవడం అవసరం అన్నారు. వక్తలను ఐఎంఏ నంద్యాల జ్ఞాపికలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ పనిల్ కుమార్, నంద్యాల మాజీ అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ వసుధ రాణి,యశోద ఆసుపత్రి ఫిజీషియన్ డాక్టర్ నవీన్ రెడ్డి, మేనేజర్ పరమేష్ , ఎగ్జిక్యూటివ్ ప్రతినిధి అక్బర్,అధిక సంఖ్యలో నంద్యాల ప్రాంత వైద్యులు పాల్గొన్నారు.